క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు, ప్రశాంత్‌నగర్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని వరంగల్ టౌన్ డీఈ శంకేశి మల్లికార్జున్ తెలిపారు. నిజాంపుర, చార్‌బౌలి, రాములవాడ, మండిబజార్, పోచమ్మమైదాన్, వెంకట్రామ జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు వాగ్దేవిలో ఇ – సమ్మిట్

మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సంవిన్, విభ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఇ – సమ్మిట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలతో గ్రామీణ నిరుద్యోగ యువత పారిశ్రామికంగా ఎదుగుదల కోసం సమ్మిట్ చేపడుతున్నట్లు వారు వివరించారు.

చలివేంద్రం ప్రారంభం



హన్మకొండ: హోప్‌ఫుల్ హార్ట్ సొసైటీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు కేవీ.జాన్సన్ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు రవీంద్రనాథ్, వెంకటరమణ, జీఎం వేణు బాబు, హనుమకొండ ఎస్ఈ మధుసూదన్ రావు, వరంగల్ ఎస్ఈ గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు.

కవితకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగంలో పరిశోధకురాలు బుర్గుల కవితకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎక్స్‌ట్రాక్షన్ ఐసోలేషన్ అండ్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ బయోయాక్టివ్ ప్రిన్సిపుల్స్ ఫ్రమ్ కెలట్రోపిస్ ప్రొసిరా రూట్ ఎక్స్‌ట్రాక్ట్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫ్ యాంటీ బ్యాక్టీరియల్ పొటెన్షియల్ అగెనెస్ట్ హ్యూమన్ పాథోజెనిక్ బ్యాక్టీరియా అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కవితకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి పర్యవేక్షణలో కవిత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

విక్రమార్జున్ యాదవ్‌కు డాక్టరేట్



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన మాదం విక్రమార్జున్ యాదవ్‌కు భారత వ్యవసాయ పరిశోధన సంస్థ డాక్టరేట్ ప్రదానం చేసింది. న్యూఢిల్లీలోని నేషనల్ అగ్రికల్చర్ సైన్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 22వ తేదీన నిర్వహించిన 63వ స్నాతకోత్సవంలో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, వ్యవసాయ శాఖ సహాయ మంత్రులు రామనాథ్ ఠాకూర్, భగీరథ్ ఠాకూర్, శాఖ కార్యదర్శి దేవేశ్ చతుర్వేది, సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు నుంచి డాక్టరేట్ పట్టా స్వీకరించారు. విక్రమార్జున్ యాదవ్ ప్రస్తుతం జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు ముంబైలోని ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

హరికుమార్‌కు సాంస్కృతిక రత్న పురస్కారం



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సంస్కృత విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హరికుమార్‌కు విజయవాడలోని విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి రత్న ఉగాది పురస్కారం –2025 లభించింది. ఈ సందర్భంగా కళాశాలలో ఆయనను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, అధ్యాపకులు మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పుల్ల రమేష్, డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ కనకయ్య, శ్రీదేవి, చందులాల్, శ్రీనివాస్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఐస్‌క్రీమ్, పండ్ల రసాలతో ఆరోగ్యం జాగ్రత్త

- కలుషిత నీరు, రసాయనాలతో తయారీ
- తక్కువ ధర అంటూ కల్తీకి పాల్పడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు



కాజీపేటలో పండ్ల రసాల్లో వాడుతున్న ఐస్



ఫాతిమానగర్‌లో ఐస్ నిల్వలు

కాజీపేట: వేసవి కాలంలో శీతల పానీయాలకు ఉన్న డిమాండ్ అంతాఇంత కాదు. ఇదే అదనుగా భావించిన నిర్వాహకులు.. యథేచ్ఛగా కెమికల్స్ వాడుతూ ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నారు. ప్రధానంగా వేసవిలో మండుటెండల్లో తిరిగే వారు ఐస్‌క్రీమ్‌లు, పండ్ల రసాలు, సోడాలు తాగి సేద తీరుతుంటారు. అయితే పట్టణం పరిసర గ్రామాల్లో అమ్ముతున్న ఐస్‌క్రీమ్‌లు, పండ్ల రసాలు కల్తీ అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వేసవిలో ఎండలను భరించలేని ప్రజలు తాపంతో వాటిని తాగుతూ అనారోగ్యాల బారినపడి ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నాణ్యత లోపించిన ఐస్‌క్రీమ్‌లు, పండ్ల రసాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

నాణ్యత లేని ఐస్‌క్రీమ్‌లు

వేసవిలో ఐస్‌క్రీమ్‌లకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు నాలుగు కాసులకు కక్కుర్తిపడి నాసిరకం, నాణ్యతలేని ఐస్‌క్రీమ్‌లు తయారు చేసి బజార్లలో విక్రయిస్తూ ఇబ్బడిముబ్బడిగా అర్జిస్తున్నారు. వాటి నాణ్యతను గుర్తించడం ఎవరికి అంతా ఈజీ కాదు. కొన్ని కంపెనీల యజమానులు బ్రాండ్ కంపెనీని పోలిన ప్యాకింగ్‌లు చేస్తూ అమ్ముతున్నారు.

కలుషిత జలాలతో ఐస్ తయారీ

పళ్ల రసాల్లో వాడే ఐస్‌ను ఉప్పునీటితో తయారు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఐస్ తయారీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వాటిపై సంబంధిత అధికారుల నిఘా కరువైందని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు.

నాసిరకంగా పండ్ల రసాలు

ట్రైసిటీగా పిలువబడే వరంగల్ నగరంలో ఎక్కడ చూసినా పండ్ల రసాల బండ్లు దర్శనమిస్తున్నాయి. అయితే వాటిలో నాణ్యతా ప్రమాణాలను ఏ మాత్రం పాటించడం లేదు. ఫ్రూట్ సలాడ్‌ల పేరిట చెడిపోయిన పండ్లను వాడుతున్నారు. తక్కువ ధర అంటూ ప్రజలు వాటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. బాదం పాలను రూ.15లకే విక్రయిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేసి తగు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు పర్యవేక్షించాలి



పండ్ల రసాలు, ఐస్‌క్రీమ్‌లు, ఐస్ తయారీ కేంద్రాలపై సంబంధిత అధికారులు నిఘా పెట్టాలి. తరచూ పర్యవేక్షిస్తూ పరీక్షల కోసం నీటిని ల్యాబ్‌కు పంపించాలి. తేడాలు వస్తే సదరు వ్యాపారులపై కేసులు నమోదు చేయాలి. అప్పుడే కల్తీ చేయడానికి వ్యాపారులు భయపడతారు.

\- కొండ్ర శంకర్, కాజీపేట

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: కాంగ్రెస్ సర్కార్ మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. నగరంలోని కేఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో ముస్లింలకు బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అన్ని మతాలు, కులాలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రజిత, అరుణాకుమారి, దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటస్వామి, అధ్యక్షుడు కిరణ్, పొన్నాల రఘు, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్‌లు మదన్, విజయ్, భగత్, అనిల్‌రెడ్డి, మార్త రవీందర్, మౌలానా సిద్ధిక్, హమీద్, ఖలీల్, అమ్జద్ పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌కుమార్ లోథ్

కేయూ క్యాంపస్: యూజీసీ నూతన ముసాయిదాతో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఆధిపత్యం పెరిగిపోతుందని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ అన్నారు. కాకతీయ యూనవర్సిటీ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 52వ మహాసభను క్యాంపస్‌లోని గణితశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీసీ ముసాయిదాను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తొలుత ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షుడు సాయికిరణ్ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేయూ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నూరి, కార్యదర్శిగా బిరెడ్డి జస్వంత్, ఉపాధ్యక్షురాలిగా పరిమళ, సహాయ కార్యదర్శులుగా పురుషోత్తం, సాయికిరణ్, కమిటీ సభ్యులు అజయ్‌సియాన్, ప్రశాంత్, యోగి, సందీప్‌రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. సమావేశంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం కృష్ణ, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు డాక్టర్ అంజన్‌రావు, బొట్ల చక్రపాణి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, బాధ్యులు కల్యాణ్, ఈశ్వర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అంకుర సంస్థల స్థాపనకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న చౌదరి

హన్మకొండ: విద్యార్థులు, యువత ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూడకుండా అంకుర సంస్థల స్థాపనకు సిద్ధం కావాలని ఇంటర్ నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ జేఏహెచ్.చౌదరి సూచించారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో జుని కార్నివాల్ టాక్ ఆన్ ది నీడ్ ఫార్ ఇన్నోవేషన్ ఎట్ ది గ్రాస్‌రూట్, లెవల్ కల్చరల్ ఫర్‌ఫార్మెన్స్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ అంకుర సంస్థల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. విశిష్ట అతిథి టెక్‌వింగ్ ఫౌండర్, సీఈఓ అనిరుద్ గౌర్ సీపీఎస్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేథ, బ్లాక్ చైన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ను అభివృద్ధి చేసుకొని పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్ దేవేందర్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వాహినిదేవి, ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి, ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శేషాచలం, తదితరులు పాల్గొన్నారు.

భరోసా, షీటీం కేంద్రాల సందర్శన

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్ డీసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.జనార్దన్ మంగళవారం వరంగల్ రంగంపేటలోని భరోసా, షీ టీం కేంద్రాలను సందర్శించారు. ఈమేరకు ఆయనకు భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, షీటీం ఇన్‌స్పెక్టర్ సుజాత పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా లైంగిక దాడులకు గురైన మహిళలు, బాలికలకు భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, భద్రత కోసం తీసుకున్న చర్యలు, ప్రజలకు అవగాహన కోసం చేపడుతున్న కార్యక్రమాలను డీసీపీకి వారు వివరించారు.

'రంజాన్' ఏర్పాట్ల పరిశీలన



ఖిలా వరంగల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఈద్గా మైదానంలో ముమ్మరంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో ముస్లిం మతపెద్దలతో కలిసి పనులను ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 31న ప్రశాంత వాతావరణంలో సామూహిక ప్రార్థనలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చాంద్‌పాషా, దస్తగిరి, మహబూబ్, సాదిక్ పాల్గొన్నారు.

సన్మానం

కేయూ క్యాంపస్: కేయూ టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన డాక్టర్ పుల్లా శ్రీనివాస్‌ను క్యాంపస్‌లోని బయో టెక్నాలజీ విభాగంలో కేయూ మాదిగ ఉద్యోగుల సమాఖ్య బాధ్యులు మంగళవారం సన్మానించారు. కేయూ మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ డాక్టర్ సుజాత, బాధ్యులు ప్రభాకర్, డాక్టర్ సంగాల ఎఫ్రీమ్‌రాజు, బొక్క మొగిలి, గాదె సుమన్, విజయరావు, శోభన్‌బాబు, మంద శ్యామ్, రణధీర్, సాగర్ పాల్గొన్నారు.

మెట్టుగుట్ట హుండీ ఆదాయం లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి హుండీల లెక్కింపును అధికారుల సమక్షంలో మంగళవారం చేపట్టారు. దుర్గేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్ పర్యవేక్షణలో కానుకలను లెక్కించగా, శివాలయం హుండీ ఆదాయం రూ.2,57,619, రామాలయం హుండీ ఆదాయం రూ.37,648 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేషభారతి వివరించారు. అలాగే, సేవా టికెట్ల విక్రయం ద్వారా రూ.4,27,282 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, శ్రీరాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రైతులను భాగస్వాములు చేయండి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం సభ్యులు

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ సహకార సమాఖ్య (విజయ డెయిరీ) నిర్వహణలో పాడి రైతులను భాగస్వాములుగా చేస్తూ జిల్లా స్థాయిలో యూనియన్లను ఏర్పాటు చేయాలని విజయ కాకతీయ పాడి రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇరుకు దేవేందర్‌రావు కోరారు. ఈమేరకు జిల్లాకు మంగళవారం వచ్చిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దేవేందర్‌రావు మాట్లాడుతు పాడి రైతుల సహకారంతో ఏర్పాటైన విజయ డెయిరీ నిర్వహణలో భాగస్వామ్యం లేకపోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని పేర్కొన్నారు. ములుకనూరు లాంటి మాక్స్ యాక్టులో ఏర్పాటైన సహకార డెయిరీలు అభివృద్ధి చెందడానికి రైతులు భాగస్వాములు కావడమేనని వివరించారు. ఈ కార్యక్రమంలో మహేందర్, పరుచూరి నరేందర్, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

వాహన సేవలో వేణుగోపాల స్వామి



వాహన సేవలో కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు

రామన్నపేట: మట్టెవాడలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు స్వామికి వారికి శ్రీసుదర్శన నరసింహ ఇష్టి, హన్మత్ వాహనసేవ, నిశచుర్నోత్సవం (పసుపు కొట్టుట) కార్యక్రమాలు నిర్వహించినట్లు బ్రహ్మోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించినట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు ఇరుకుల్ల రమేష్, కొత్త వెంకటకృష్ణ, పబ్బ విశ్వప్రసాద్, తోట నవీన్‌కుమార్, బెజుగం రజినీకాంత్, పనేష్, దివ్వెల శ్రీనివాస్, నీల రాజన్న, నాగరాజు, సత్యనారాయణ, సర్వేశ్వర్‌రావు, ఎలగందుల రమేష్, పసునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: కరీంనగర్ – హనుమకొండ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని యువజన సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం అర్ధనగ్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ హనుమకొండ నుంచి ఎల్లాపూర్ వరకు జాతీయ రహదారిని విస్తరించాలని డిమాండ్ చేశారు. రహదారిలో పలు ప్రాంతాల్లో మూలమలుపులు ఉండడం, సెంట్రల్ లైటింగ్ సిస్టం లేకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హసన్‌పర్తి మండల కార్యాలయం నుంచి ఎల్లాపురం వరకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నప్పటికీ అది కార్యరూపం దాల్చడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు దీకొండ భిక్షపతి, మేకల హరిశంకర్, మేకల హరిశంకర్, మారం తిరుపతి, సుధాకర్, రాజు, సాంబయ్య, నల్ల కిరణ్, సుమంత్, సాయి, పెద్దమ్మ క్రాంతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గొర్రెల సజీవ దహనంపై విచారణ జరపాలి

వరంగల్: వరంగల్ ఖిలా వరంగల్ మండల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులు 200లకు పైగా గొర్రెలను సజీవ దహనం చేసిన ఘటనపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ పోలీసు కమిషనర్‌కు మంగళవారం లేఖ రాశారు.

న్యాయవాదిని హత్య చేస్తే న్యాయాన్ని చంపినట్లే

కేయూ క్యాంపస్: న్యాయవాదిని హత్య చేస్తే న్యాయాన్ని చంపినట్లేనని, హైదరాబాద్‌లో చంపాపేటలో న్యాయవాది ఇజ్రాయిల్‌ను అతి కిరాతంగా హత్య చేసిన నిందితులను ఉరితీయాలని న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు (ఏబీఎస్) కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో న్యాయవాదుల రక్షణకు వారికి లైసెన్స్‌గన్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ములుగు జిల్లా ప్రజా సంఘం జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతి గౌడ్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల నోటిఫికేషన్ ఇవ్వాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పార్ట్‌టైం అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వాలని కాకతీయ యూనివర్సిటీ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, డాక్టరేట్స్ అసోసియేషన్ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు యూనివర్సిటీలోని గ్రంథాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ కేయూ ఇన్‌చార్జ్ మధు, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పాలాకుల కొమురయ్య మాట్లాడుతూ పదేళ్లుగా కాకతీయ యూనివర్సిటీలో పార్ట్‌టైం అధ్యాపకుల నియామకాలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులర్ అధ్యాపకులు 77మంది మాత్రమే ఉన్నారని అన్నారు. సమావేశంలో డాక్టర్ అరూరి రంజిత్, డాక్టర్ వంగ మల్లేష్, డాక్టర్ ఉర్సు రాజేందర్, మద్దిరాల మోహన్‌రెడ్డి, మహ్మద్ పాషా, అనిల్, సునీల్, రాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రుమటాలజీ వైద్య శిబిరానికి స్పందన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీఏషియన్ రుమటాలజీ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందని నిర్వాహకుడు మధుకర్ రావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగిన వైద్య శిబిరంలో రుమటాలజిస్ట్ డాక్టర్ వి.సునీల్ పాల్గొని 150మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం, ఆరోగ్య నియమాలు పాటించకపోవడం వల్లనే అత్యధిక శాతం మందిలో కీళ్ల నొప్పులు వస్తున్నాయని అన్నారు. శిబిరంలో నిర్వాహకులు మధుకర్, సురేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. కేయూ లైబ్రరీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు విద్యాశాఖమంత్రిని నియమించలేదని అన్నారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేష్, బాధ్యులు సందీప్, దిలీప్, మహేష్, రాంబాబు, సాయికిరణ్, భద్రన్న, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి దూసుకెళ్లిన కారు

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఆకస్మాత్తుగా కారు అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి వైన్‌షాపులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. కారు బెలూన్స్ తెరుచుకోవడంతో డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. సంఘటన స్థలానికి మామునూరు పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వరంగల్: వరంగల్ గిర్మాజీపేట చార్‌బౌలి ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం తనిఖీలు చేసి రూ.38,620 విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడు షాపు యజమాని ముజాహిద్‌ను అదుపులోకి తీసుకుని కేసు నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, ఎస్సై వంశీకృష్ణతో పాటు పోలీసులు పాల్గొన్నట్లు ఏసీపీ తెలిపారు.

గుప్త నిధుల తవ్వకాలపై విచారణ

ఖిలా వరంగల్: తూర్పుకోటలోని ఓ ఇంట్లో గుప్త నిధుల కోసం ఆదివారం అర్ధరాత్రి తవ్వకాల్లో పాల్గొన్న వ్యక్తులను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. గుప్తనిధుల కోసం రాతి, మట్టికోట పరిసరాల్లో సంచరించే ముఠాకు వారికి ఏమైన సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్న ఆయన తెలిపారు.

పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

హసన్‌పర్తి: పాఠశాలలు, కళాశాలకు వెళ్తున్న తమ పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా పెట్టాలని కాకతీయ యూనివర్సిటీ ఎస్సై రవీందర్ సూచించారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, విద్య ప్రాముఖ్యత అనే అంశాలపై కిట్స్ కళాశాలలో మంగళవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ పిల్లల నడవడికను నిత్యం గమనిస్తూ ఉండాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలతో జీవితం నాశమవుతుందని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ శ్రీధర్, డాక్టర్ నాగార్జున్ రెడ్డి, ఏఎస్సై నాగమణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లపై లాఠీచార్జ్ అమానుషం



హనుమకొండ అంబేడ్కర్ కూడలిలో రాస్తారోకో చేస్తున్న ఆశ కార్యకర్తలు

హన్మకొండ: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తున్న ఆశ వర్కర్లపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. హైదరాబాద్‌లో మెడికల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు మంగళవారం ర్యాలీ తీశారు. అంబేడ్కర్ కూడలిలో రాస్తారోకో నిర్వహించగా వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. పోలీసులు అక్కడికి చేరుకుని రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ ఆశా యూనియన్ నాయకులు సీహెచ్.రాజేశ్వరి, ఇ.శోభ, లీల, గొర్రె పుతిలి, రమ, భాగ్య, సంపూర్ణ, స్వప్న, ఎం.కవిత, తార, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలి



మడికొండ: మడికొండ, రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని అడ్‌హక్ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు సంబంధిత వాల్‌పోస్టర్లను మంగళవారం విడుదల చేసి ఆటోలకు వెనుకభాగంలో అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డు వలన ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే స్థానికంగా నీటి కాలుష్యం, వాయు కాలుష్యం అయినట్లు అధికారులు వెల్లడించారని వాపోయారు. కార్యక్రమంలో స్థానికులు అడ్‌హక్ కమిటీ సభ్యులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.